పండుగ సాయన్న జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి

నాంపల్లి: ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్ కల్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు చిత్రంలో చరిత్రను వక్రీకరించారని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్ అన్నారు. బహుజన పోరాట యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ చరిత్రను హరిహర వీరమల్లు పేరుతో చిత్రాన్ని చూపెడుతున్నారని విమర్శించారు. పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ప్రసంగించారు. పండుగ సాయన్న ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన మహనీయుడని, ఆయన చరిత్రను కనుమరుగు చేసేందుకు అలాంటి సినిమాలు తెరకెక్కిస్తున్నారని విమర్శించారు. అలాగే పండుగ సాయన్న జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టి, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటుగా పాలమూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం



గోల్కొండ: రాందేవ్‌గూడ రోడ్డులో ఉన్న ఆషూర్‌ఖానాలో జరుగుతున్న మొహర్రం సబీల్ కార్యక్రమంతో పాటు ఆలంల ఊరేగింపును ప్రశాంతంగా జరిగేలా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని గోల్కొండ పీస్ అండ్‌మైత్రి కమిటీ అధ్యక్షుడు ఆబీద్ అన్నారు. గురువారం ఉదయం గోల్కొండ నూరాని మసీదు వద్ద పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా జరిగే అన్ని పండుగలు, ఉత్సవాలలో తమ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పరమానందం, రషీద్, నర్సింహ, యూనుస్ తదితరులున్నారు.

శుభకార్యాలకు తక్కువ అద్దెతో ఆర్టీసీ బస్సులు



వేదవతి, ఫారూఖ్‌నగర్ డీఎం

చాంద్రాయణగుట్ట: వివాహాలు, విహార యాత్రలు తదితర శుభకార్యాలకు ఫారూఖ్ నగర్ డిపో నుంచి తక్కువ ధరలో బస్సులను అద్దెకు ఇవ్వనున్నామని డిపో మేనేజర్ వేదవతి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ..ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీది ప్రత్యేకమైన గుర్తింపుగా చెప్పుకోవాలన్నారు. ఈ నెలలో అధికంగా వివాహాలు, శుభకార్యాలు ఉన్నందున అద్దెకు మెట్రో, ఆర్డినరీ బస్సులను ఎలాంటి డిపాజిట్ లేకుండా ఇస్తున్నామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పెళ్లిళ్ల కోసం బస్సులను బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ట్రాఫిక్ ఎస్టీఐ (9989330556, 82477 52836) నంబర్లలో గాని నేరుగానైనా సంప్రదించాలన్నారు.

సోమేశ్వరరావుకు ఘన నివాళి



సోమేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భట్టు రమేష్

నాంపల్లి: ప్రముఖ నటుడు, దర్శకుడు దుగ్గిరాల సోమేశ్వరరావు సంస్మరణ సభ గురువారం సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో జరిగింది. ఈ సందర్భంగా సోమేశ్వరరావు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ముఖ్యఅతిథి/ గా హాజరై ప్రసంగించారు. సోమేశ్వరరావు గొప్ప నటుడని కీర్తించారు. రంగస్థలానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. లలిత కళా పీఠం పీఠాధిపతి ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ..సోమేశ్వరావు పెద్ద దర్శకులని, ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాది గోపాలకృష్ణ, వెంపట రాధాకృష్ణ, శ్రీధర్ బీచరాజు. బీహెచ్.పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారులకు వ్యతిరేకంగా తెచ్చిన బిల్లులను అడ్డుకుంటాం'



అఫ్జల్‌గంజ్: మత్స్యకారులకు వ్యతిరేకంగా తెచ్చిన బిల్లులను అడ్డుకొని తీరుతామని రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తుందన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చిన బిల్లులకు వ్యతిరేకంగా న్యూఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ నిరసనలో మెట్టు సాయికుమార్ పాల్గొని మోదీ ప్రభుత్వంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..తెలంగాణలో మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో విధాల సహకారాలు అందిస్తుంటే కేంద్రంలో మోదీ ప్రభుత్వం మత్స్యకారులకు వ్యతిరేకంగా బిల్లులు తేవడం సిగ్గుచేటన్నారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి



సంతోష్‌నగర్: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ సూచించారు. ఐ.ఎస్.సదన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం చంపాపేట్ మారుతీనగర్‌లో కమ్యూనిటీ హాల్‌లో మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ..బస్తీ ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మారుతీనగర్‌లోకి భారీ వాహనాల ప్రవేశం లేదని..డీఎంఆర్‌ఎల్ యూ టర్న్ వద్ద సిబ్బందిని నియమించాలని ప్రజలు అభ్యర్థించారన్నారు. వీటి కోసం ట్రాఫిక్ పోలీసులతో చర్చిస్తామన్నారు. ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య, ఎస్సైలు విజయ్‌కుమార్, బ్రహ్మాచారి, అడ్మిన్ ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పాత నేరస్తుడికి రెండు నెలల జైలు

గౌలిపురా: అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ పాత నేరస్తుడ్ని భవానీనగర్ పోలీసులు గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమామతిరావు నిందితునికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం ..తలాబ్‌కట్టా సలాంచౌక్ ప్రాంతానికి చెందిన అహ్మద్ బిన్ సాధిక్ (29) పాత నేరస్తుడు. కాగా భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అహ్మద్ బిన్ సాధిక్ అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా..పూర్వ పరాలను పరిశీలించిన 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమామతిరావు నిందితునికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కోఠి ఈఎన్‌టీని సందర్శించిన తమిళనాడు వైద్య బృందం



సుల్తాన్‌బజార్: కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రిని తమిళనాడుకు చెందిన టీఎన్‌హెచ్‌ఎస్‌పీజేడీ డాక్టర్ రవిబాబు శివరాజ్, డీడీడీ పీహెచ్ అండ్ పీఎం డాక్టర్ పర్విబాన్, డీడీడీ ఎంఈ అండ్ ఆర్ డాక్టర్ వి షింటిల్‌కుమార్, డీఎం అండ్ ఆర్‌హెచ్‌ఎస్ నూడల్ అధికారి డాక్టర్ పి. షింటిల్‌కుమార్ బృందం గురువారం సందర్శించింది. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భవ అమలుతీరు, చిన్నపిల్లలకు కాంక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్ ప్రక్రియ, రోగులకు అందిస్తున్న భోజనం, సర్జరీ జరిగిన రెండు రోజులు, తర్వాత అందిస్తున్న భోజనంపై, వైద్య సేవలపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద ఆచార్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని వారు పరిశీలించి ఆసుపత్రి అంతా కలియతిరిగి ఆపరేషన్ థియేటర్, పేషంట్‌ను పరీక్షించే గదులను, రోగుల బట్టలు శుభ్రపరిచే వాషింగ్ మిషన్ తదితర సెంటర్లను పరిశీలించారు. ప్రతి అంశాన్ని ఆ బృందానికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, ఆర్ఎంఓ డాక్టర్ అనిల్‌కుమార్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కస్తూరి, జూనియర్ అసిస్టెంట్ రవి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, సూర్‌వైజర్ శ్రీనివాస్, మధు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



యాకుత్‌పురా: తెలంగాణ బాలోత్సవం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నగరంలో నిర్వహించిన విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు–2024 కార్యక్రమంలో ప్రభుత్వ శాలిబండ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మౌనిక, జగదీష్, నిత్య, దేవిక, ఉమా మహేశ్వరీ, సందీప్, హర్షవర్దన్, మంజుల, విష్ణు ప్రియ ఉత్తమ ప్రతిభకు గాను ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను మంతి సీతక్క చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ భాస్కర్, నవనీత, హరినారయణ, ఆనిరుధ్, మధుసూదన్ రావు, అంజలీ, శ్రీదేవి, మంజుల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టుకు మాజీ ఎమ్మెల్సీ హాజరు

సిటీ కోర్టులు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 1న రాత్రి అమరవీరులకు క్యాండీల్ ర్యాలీని అనుమతి లేకుండా నిర్వహించారని బీఆర్‌ఎస్ నాయకులపై సైఫాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే ఈ కేసు మొదటి విచారణ గురువారం నాంపల్లి కోర్టులో జరుగగా బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. దీనిపై నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లో విచారణ చేపట్టారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 18కి న్యాయస్థానం వాయిదా వేసింది. ముందుగా నిందితుల తరుపునా న్యాయవాది జక్కుల లక్ష్మణ్ వాదనలు వినిపిస్తూ జూన్ 1న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో పాటు మిగత నాయకులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కలిసి గన్‌పార్క్ (అమరవీరుల స్థూపం) నుంచి ట్యాంక్‌బండ్ (అమరవీరుల దీపం) వరకు క్యాండీల్ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి కావాలని కోరగా కమిషనర్ ఇందుకు అంగీకరించారన్నారు. అయితే సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 వరకు అనుమతి ఉందని, ఆ గంట వ్యవధిలోనే ర్యాలీ ముంగించుకున్నామని, 500 మంది కూడా ర్యాలీలో పాల్గొనలేదని తెలిపారు. కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను పాటించినా పోలీసులు కావాలనే అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని న్యాయస్థానానికి సూచించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



హకీంపేట్‌లో బల్దియా అధికారులతో ఎమ్మెల్యే

గోల్కొండ: దోమల నివారణకు బల్దియా మలేరియా విభాగం వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో బుల్కాపూర్ నాలాలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేవలం ఆయిల్ బాల్స్ వదిలేసి మలేరియా అధికారులు చేతులు దులుపుకోవద్దు అని అన్నారు. నాలాలు, చెరువులలో పూడికలు తీస్తూ వాటిని శుభ్రంగా ఉంచితే దోమలు వృద్ధి చెందవన్నారు. అయితే మలేరియా అధికారులు మాత్రం చిత్తశుద్ధితో పని చేయడం లేదని అన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా దోమలు వృద్ధి చెంది విష జ్వరాలను వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా డీఎంసీ శిరేఖ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ అలీ, మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, మాజీద్ తదితరులున్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో కర్నాటి సాయిరెడ్డి, మహాలమ్మ తదితరులు

సుల్తాన్‌బజార్: పీహెచ్, ఎంఈ పబ్లిక్ హెల్త్ నర్సెస్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.మహాలమ్మ అధ్యక్షతన గురువారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ..వివిధ క్యాడర్ల మహిళా ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరిపామన్నారు. ప్రధానంగా స్పౌస్, అనారోగ్య మహిళా ఉద్యోగులకు బదిలీలలో జరిగిన అన్యాయాలను సవరించడం అత్యవసరమని ఆమె డిమాండ్ చేశారు. వీసీ, సెంకడ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని దీనికి హెచ్:1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి మద్దతు పలికారని తెలిపారు. తమ సమస్యలపై డీహెచ్ కార్యాలయంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సక్కుబాయి, నాయకులు ప్రమీల, మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: గోషామహల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ నాయకులు, గోషామహల్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నలుమూలలా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి మేయర్ గద్వాల విజయలక్ష్మి సహకారంతో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపడుతామన్నారు. గురువారం మేయర్‌కు నియోజకవర్గం సమస్యలపై మెమోరాండం అందజేశారు. అనంతరం మమతాగుప్తా, సంతోష్‌గుప్తా మాట్లాడుతూ..నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను మేయర్ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి సానుకూలంగా స్పందించారు. గోషామహల్‌లో అన్ని శాఖల అధికారులు వేగవంతంగా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపాదికన చేపట్టాలని పలు శాఖల ఉన్నతాధికారులకు ఆమె ఆదేశించారు.

నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కృషి



డాక్టర్ జయకృష్ణ

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని ఆస్పత్రికి నూతనంగా వచ్చిన ఆర్ఎంఓ-1 అన్నారు. ఇటీవల కాలంగా వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహించిన ఆర్ఎంఓ-1 డాక్టర్ శేషాద్రి గాంధీ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. గాంధీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జయకృష్ణ ఉస్మానియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. దీంతో ఆయన గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గురుకులాల్లో సమయ పాలనను మార్చాలి



వేమిరెడ్డి దిలీప్‌కుమార్ రెడ్డి

అబిడ్స్: గురుకులాల్లో ప్రభుత్వం నిర్ణయించిన పని వేళల్లో హేతుబద్ధత, శాస్త్రీయత లేకపోవడంతో విద్యార్థులు నరకయాతన పడుతున్నారని పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ..ఉదయం 5 గంటలకే గురుకులాల్లో విద్యార్థులను నిద్ర లేపడం ద్వారా కాలకృత్యాలు, వ్యాయామం పూర్తి చేసుకుని 7 గంటలకు అల్పాహారాలకు ఎలా సిద్ధమవుతారని ప్రశ్నించారు. సాయంత్రం సైతం 6 గంటలకు డిన్నర్ చేసి తిరిగి ఉదయం 7.30 గంటల వరకు అల్పాహారం చేయడం నిబంధనలు పెట్టడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. సమయపాలనను గురుకులాల్లో మార్చి విద్యార్థులకు తగు న్యాయం చేయాలన్నారు. ఉన్నతాధికారులు విద్యార్థుల నరకాన్ని పరిగణించి టైంటేబుల్‌ను మార్చాలని వేమ్‌రెడ్డి దిలీప్‌కుమార్ రెడ్డి సూచించారు.

'ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య సిబ్బంది'



దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: అన్ని ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఏఐఎంఐఎం ఓబీసీ ఇన్‌చార్జి ఆర్. దీపేష్ రాజ్ వర్మ తెలిపారు. ఈ మేరకు తాను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశానని తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ రాతపూర్వకంగా ఇచ్చిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. స్పందించిన కలెక్టర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేయడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్



అబిడ్స్: మాజీ మంత్రి, రాష్ట్ర బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ కలిశారు. గోషామహల్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు కేటీఆర్‌కు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో కార్యకర్తలకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గోషామహల్‌లో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

షహజాదా అలీ అస్గర్‌ను స్మరించుకుంటూ మాతం, ఊరేగింపు



దబీర్‌పురా: షహజాదా అలీ అస్గర్(ఎ.ఎస్) 1385వ అమరవీరుల వార్షికోత్సవం సందర్భంగా గురువారం గెట్‌వెల్ క్లీనిక్ ఖానీ మాతం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ (ఎ.ఎస్) చిన్న కుమారుడు త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతం నిర్వహించారు. ఊరేగింపులో ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ, మీర్ చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్‌తో పాటు బీజేపీ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఆర్థికంగా ఎదగవచ్చు



మాట్లాడుతున్న జేఎస్ఎస్ చైర్మన్ మాచర్ల జయశంకర్

విజయనగర్‌కాలనీ: వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందితే ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని జన శిక్షణ సంస్థాన్ (జేఎస్ఎస్) చైర్మన్ మాచర్ల జయశంకర్ అన్నారు. గురువారం విజయనగర్‌కాలనీ జేఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అక్కడ శిక్షణ ఇస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, వయోజనులు చదువుతో సంబంధం లేకుండా కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్, మెహందీ, జనపనార వస్తువుల తయారీ, చీరల అద్దకం తదితర కోర్సులలో శిక్షణ పొంది తమతో పాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించవచ్చన్నారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి వై.మాలకొండయ్య, నరహరి, ఎస్.సుధ, మూర్తుజ అలీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సతీష్‌బిడ్లా

జియాగూడ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ సంఘ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కోఆర్డినేటర్ సతీష్‌బిడ్లా అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ..విద్య, ఉద్యోగాలందూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీలోని వెనుకబడిన కులాలు లబ్ధిపొందుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డి.శుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్, ధర్మవీర్, ఉపాధ్యక్షులు కె.చమన్‌సింగ్, సత్యనారాయణ్, కె.విజయ్, ప్రధాన కార్యదర్శి బి.ప్రకాష్, ఎస్.రాకేష్, సభ్యులు రాజేంద్రసింగ్, పాపాలాల్, కల్యాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హుజైఫ్

శాలిబండ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రూప్‌లాల్‌బజార్ బస్తీ దవాఖానా వైద్యుడు డాక్టర్ హుజైఫ్ అన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతిరోజూ బస్తీ దవాఖానాకు 100–150 మంది వైద్య సేవల కోసం వస్తుంటారన్నారు. తమ బస్తీ దవాఖానాలో రోగులకు అవసరమైన రక్త, సీబీపీ, షుగర్, లివర్, మలేరియా, షుగర్, మూత్ర, విటమిన్ బీ12, సిరం, డీ-3, కంప్లీట్ యూరిన్ తదితర పరీక్షలను నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జలుబు, దగ్గు లాంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

ముగిసిన రంగనాథస్వామి పవిత్రోత్సవాలు

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. ప్రతిరోజూ అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఆండాల్ తిరు నక్షత్రం మహోత్సవం, మహాపూర్ణాహుతి, చక్ర స్నానం, అభిషేకం, పల్లకీ సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ ఎస్‌టీ చారి మాట్లాడుతూ.. మహిమాన్విత రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. ఈ ఉత్సవాలు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథచార్యులు, నృసింహాచార్యులు, బద్రీనాథ్ చార్యులు, వంశీ తదితర వేద పండితుల నేతృత్వంలో జరిగాయి.



స్వామివారి పల్లకీ సేవ

భక్తిశ్రద్ధలతో ఆలంల ఊరేగింపు



గోల్కొండ కోట వద్ద ఆలంలు

గోల్కొండ: ఆలంల ఊరేగింపులు గోల్కొండ వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గురువారం తెల్లవారుజాము నుంచి గోల్కొండ కోట వద్ద నుంచి భక్తిశ్రద్ధలతో ఆలంల ఊరేగింపు ప్రారంభమైంది. చోటా బజార్‌లో భక్తులు ఆలంలకు దట్టీలు కట్టి పూలమాలలు పెట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలంల ఊరేగింపు ముందుకు సాగినా కొద్ది రోడ్లపై భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. బడా బజార్, ఖాజీ గల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఆలంలను దర్శించుకోని తమ మొక్కులు తీర్చినందుకు దట్టీలు కట్టారు. ఈ సందర్భంగా ఆషూర్‌ఖానా నిర్వాహకులు షకీల్ పహల్వాన్ మాట్లాడుతూ.. మొహర్రం సందర్భంగా ఆలంల ఊరేగింపు సుధీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో షర్బత్, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.

వాటర్‌బోర్డులో అక్రమాలపై విచారణ జరపండి



మాట్లాడుతున్న పొల్కం శ్రీనివాస్

అబిడ్స్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మెట్రో వాటర్ బోర్డులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి సంబంధిత అప్పటి వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పొల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం మున్సిపల్ సెక్రెటరీగా ఉన్న దానకిశోర్ గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టరకు బిల్లులు చెల్లించక రోడ్డుపాలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి దానకిశోర్‌పై ఫిర్యాదు చేశామని ఆయన వివరించారు. దానకిశోర్‌పై అప్పట్లో కూడా మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దాన కిశోర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చేనేత వస్త్రాల కౌంటర్ ప్రారంభం



దూద్‌బౌలి: చేనేత వస్తువులతో పాటు చేనేత వస్త్రాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. గురువారం తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జువైనల్ వెల్ఫేర్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ సహకారంతో హైకోర్టు ఆవరణలోని సీ బ్లాకులో జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లోని ఖైదీలు తయారు చేసిన చేనేత వస్త్రాల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జువైనల్ జస్టిస్ కమిటీ, హైకోర్టు చైర్ పర్సన్ జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జువైనల్ వెల్ఫేర్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ కాంతి వెస్లీ, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు.